క్లుప్తంగా

'ప్రజాసేవకు పరితపించిన మదన్‌లాల్'

జనగామ: వైరా మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ మదన్‌లాల్ నిరంతరం ప్రజా సేవకోసం పరితపించే వారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మదన్‌లాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండె పోటుతో మృతి చెందగా, ఎమ్మెల్యే పల్లా సంతాపం ప్రకటించారు. మదన్‌లాల్ చేసిన సేవలు నియోజకవర్గ ప్రజల్లో చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బుగులు వెంకన్నను దర్శించుకున్న కేంద్రమంత్రి తల్లి



పూజలో పాల్గొన్న శకుంతల తదితరులు

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామిని మంగళవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ తల్లి శకుంతల, కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం వారికి అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

సన్మానం

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అయిత జయరాములును సోమవారం మాజీ పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ వైస్ చైర్మన్ రాపోలు పుల్లయ్య సన్మానించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ రైతులందరి కష్టార్జితంతో నిర్మితమైన సొసైటీలో ఇటీవల కాలంగా అనేక అవినీతి అక్రమాలు చోటు చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. రైతులకు సకాలంలో పంట రుణాలు, ఎరువులు అందించాలని ఆయన కోరారు. రాపోలు రామ్మూర్తి, ఓరుగంటి మనోహర్, ముక్కెర ఐలయ్య, కారంపూడి వెంకటనర్సయ్య, మేకల యాకస్వామి పాల్గొన్నారు.

విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రమేశ్

జనగామ రూరల్: ఒకే దేశం ఒకే ఎన్నిక సదస్సును విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 11 గంటలకు సదస్సు పట్టణంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర సంఘటన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి హాజరు కానున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కన్వీనర్ లక్ష్మీ నరసయ్య, పట్టణ అధ్యక్షుడు అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, జగదీష్, నవీన్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

పాలకుర్తి: మండలంలోని ఈరవెన్ను గ్రామంలో దామెర మహేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా మంగళవారం ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి బియ్యం, నిత్యావతసర సరుకులను అందజేశారు. బిర్రు సోమేశ్వర్, ముస్కు కేశవరావు, ఏదునూరి మదార్, తొడుసు మల్లేష్, జక్కుల రాజు, అనంతుల పురుషోత్తం, యార రాజు, బిర్రు వెంకటేశ్వర్లు, అనుముల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత రమాబాయి అంబేడ్కర్



నివాళులర్పిస్తున్న నాయకులు

జనగామ రూరల్: నేటి మహిళలకు స్ఫూర్తి ప్రదాత రమాబాయి అంబేడ్కర్ అని కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జెరిపోతుల పరశురామ్ అన్నారు. రమాబాయి అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పిడుగు ఆశీర్వాదం, ప్రసాద్, ఎల్లేష్, రమేష్, ఎల్లయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుల జారీ ఎప్పుడో?

- దరఖాస్తు చేసి నెలలు.. అయినా కలగని మోక్షం
- తల్లిగారింటి వద్ద కార్డులో పేరు రద్దు
- అత్తింటి కార్డులో పేరు నమోదులో జాప్యం



రఘునాథపల్లి తహసీల్దార్ కార్యాలయం

రఘునాథపల్లి: నూతన రేషన్‌కార్డుల కోసం నిరుపేదలు వేల కళ్లతో ఎదురు చూస్తున్నారు. అభయహస్తం.. ప్రజాపాలన.. మీ సేవా కేంద్రాల్లో పలుమార్లు దరఖాస్తులు చేసినా.. కొత్త కార్డులు జారీ జాప్యం.. కార్డు ఉన్న వారి కుటుంబ సభ్యుల పేర్లు సరిగా చేరలేదు. దీంతో దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వందలాది మంది దరఖాస్తు చేశారు. ఏళ్ల తరువాత రేషన్ కార్డులు జారీ చేస్తుండడంతో తల్లిగారి గ్రామంలో ఉన్న రేషన్ కార్డుల నుంచి పేరు రద్దు చేసుకొని అత్తగారి గ్రామంలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొందరికి కార్డులు వచ్చినట్లు చూపుతుండగా మరికొందరికి నిరాశే మిగిలుతుంది. పాత కార్డులోకి కొత్త పేర్ల నమోదు, కొత్త కార్డుల కోసం వందలాది దరఖాస్తులు చేసుకున్నారు. తక్కువ సంఖ్యలో కార్డుల జారీ.. కుటుంబ సభ్యుల పేర్లు సహితం కొందరివే చేరాయి. రేషన్‌కార్డు కోసం వచ్చిన దరఖాస్తులను ఆర్ఐలు పరిశీలించి తహసీల్దార్‌కు పంపిస్తారు. తహసీల్దార్ ఆమోదిస్తే రేషన్ కార్డు జారీ అవుతుంది. పనుల ఒత్తిడితో రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలనను అధికారులు పట్టించుకోవడం లేదు. కార్డుల జాప్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే రేషన్ కార్డు ఉన్న వారికి ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. దీంతో మాకు కడుపు నిండా తినే అదృష్టం కూడా లేదా..? అని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం తహసీల్ కార్యాలయం, మీసేవా కేంద్రాలచుట్టూ తిరగాల్సి వస్తుందని, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

ఇంకెన్నాళ్లు వేచి చూడాలి..?



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా. ప్రజాపాలన, పలుమార్లు మీ సేవా కేంద్రాల్లో కూడా దరఖాస్తులు సమర్పించా. భార్య పేరు అత్తగారింటి వద్ద కార్డులో, మా అమ్మ యజమానిగా ఉన్న రేషన్ కార్డులో నా పేరు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసి తొలగించాం. కానీ కొత్త కార్డు మాత్రం రాలేదు. ఇంకా ఎన్ని రోజులు వేచి చూడాలి.

\- నూనే ముంతల రాజేష్, వెల్ది

అర్హులందరికీ రేషన్ కార్డులు

కొత్త రేషన్ కార్డులు, పాత రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రతి దరఖాస్తు పరిశీలించాల్సి ఉంది. సర్వర్ సమస్యతో పాటు భూ భారతి కార్యక్రమంలో బాగంగా ఇతర మండలంలో జరిగే రెవిన్యూ సదస్సులకు వెళ్లాల్సి వస్తుండటంతో కొంత జాప్యం జరుగుతుంది. అర్హతలు ఉన్న వారందరికి కొత్త రేషన్ కార్డులతో పాటు, కుటుంబ సభ్యుల పేర్లు కూడా నమోదు చేస్తున్నాం.

\- మోహ్సిన్ ముజ్తబ, తహసీల్దార్

ఆపదలో అండగా నిలుద్దాం



సమావేశంలో పాల్గొన్న వైద్యులు

జనగామ: రోడ్డు ప్రమాదంలో గాయపడి భరోసా కోసం ఎదురు చూసే క్షతగాత్రులకు అండగా ఉండాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ రావు, ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ భిక్షపతి పిలుపునిచ్చారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సంఘటన స్థలంలో ప్రమాదాన్ని చూసి పారిపోకుండా, మనవంతు బాధ్యతగా సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపొద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి, అమాయకులకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత క్షతగాత్రులకు మంచినీరు తాగించొద్దని సూచించారు. అత్యవసర సమయంలో విలువైన ప్రాణం కాపాడేందుకు ప్రతిఒక్కరు సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రాజు

పాలకుర్తి టౌన్: తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక మండల అధ్యక్షుడు సింగ మహేందర్‌రాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో మహేందర్‌రాజు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం లాఠీలకు, తూటాలకు ఎదురొడ్డి పోరాడి, ప్రాణత్యాగాలు చేసిన ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించిన 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులతో పాటు న్యాయమైన కోర్కెలను తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న తెలంగాణ ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేసిన ఉద్యమకారులకు ధన్యవాదాలు తెలిపారు. మూల ప్రభాకర్‌గౌడ్, సింగారపు దీపక్, పోలాస సోమయ్య, లావుడ్య రవి, యతిపతి శ్రీకాంత్, ఎడవెల్లి దండయ్య, గజ్జి సంతోష్‌కుమార్, గుగ్గిళ్ల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



పాలకుర్తిటౌన్ పోలీస్ స్టేషన్‌వద్ద మాజీ సర్పంచ్‌లు

పాలకుర్తి టౌన్/బచ్చన్నపేట/దేవరుప్పుల: సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడించనున్నారనే సమాచారంతో పలు మండలాల్లోని మాజీ సర్పంచ్‌లను మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ గతంలో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లించకుండా జాప్యం చేస్తుందని అన్నారు. పెడింగ్ బిల్లులు చెల్లించకుండా తమను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు.

రైతులకు వరం.. ఏఎంసీలోని ఐకేపీ సెంటర్

- మార్కెట్ చైర్మన్ శివరాజ్ యాదవ్



మాట్లాడుతున్న శివరాజ్ యాదవ్

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని కాటన్ యార్డులో ఏర్పాటు చేసిన చీటకోడూరు ఐకేపీ సెంటర్ రైతులకు వరంగా మారిందని ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మార్కెట్‌లో మాట్లాడుతూ రైతులకు సౌకర్యంగా ఉండేందుకు మార్కెట్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. సన్నాలకు సైతం బోనస్ త్వరలోనే వస్తుందన్నారు. ఐకేపీ సెంటర్‌లో ఇప్పటి వరకు 628 మంది రైతుల వద్ద 95వేల434 (152 లారీలు) బ్యాగుల ధాన్యం కొనుగోలు చేసి సీఎంఆర్ కోసం మిల్లులకు పంపించినట్లు చెప్పారు. ఇందులో 56 మంది రైతుల వద్ద 4,101 బస్తాల సన్నాలు కొనుగోలు చేశామన్నారు. సెంటర్‌కు వచ్చే రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ సీజన్‌లో మద్దతు ధరకు చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.

ముమ్మరంగా సుందరీకరణ పనులు



బతుకమ్మకుంటలో జరుగుతున్న అభివృద్ధి పనులు

జనగామ: జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో సుందరీకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కుంట అభివృద్ధి, వాకింగ్‌ట్రాక్, సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కుంట వాకింగ్ ట్రాక్ సమీపంలో మంగళవారం వీధిదీపాలను వెలిగించారు. దీంతో తెల్లవారుజాము, రాత్రి సమయంలో వాకింగ్ చేసే వారికి ఇబ్బందులు తప్పనున్నాయి. అభివృద్ధికి నోచుకోని బతుకమ్మకుంటపై సాక్షిలో ప్రచురితమైన కథనాలతో జిల్లా యంత్రాంగం కదిలొచ్చింది. రూ.1.50 కోట్లతో పనులు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలి

బచ్చన్నపేట: సమస్యల పరిష్కారం కోసం అందరూ సంఘటితం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్ మాదిగ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రపతి చేతుల మీదుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ పద్మశ్రీ పురస్కారం అందుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. మందకృష్ణకు స్వాగతం పలికేందుకు ఈ నెల 31న వరంగల్‌కు తరలిరావాలని కోరారు. ఉపేందర్, నర్సయ్య, నర్సింగారావు, రవీందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

తరిగొప్పుల: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని కేజీబీవీ ప్రత్యేక అధికారి సునీత అన్నారు. మంగళవారం అక్కరాజుపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీలో అందుతున్న విద్య, మౌలిక వసతులలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దేవరుప్పుల: జాతీయ కుటుంబ సామాజిక పథకం (ఎన్ఎఫ్‌బీఎస్)కు 35 ఏళ్ల వయసు లోపు ఉన్న వితంతవులు మీసేవలో దరఖాస్తు చేసుకుంటే ఆర్థిక సాయం పొందుతారని తహసీల్దార్ అండాళు సూచించారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన వితంతువులు మీసేవలో కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించి..ఆన్‌లైన్ రసీదు కార్యాలయంలో అందజేయాలన్నారు.

విదేశాలకు వెళ్తున్న ఎర్రబెల్లిని కలిసి బీఆర్ఎస్ శ్రేణులు

దేవరుప్పుల: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అమెరికా పర్యటనకు వెళ్లనున్న సందర్భంగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో దేవరుప్పుల మండల బీఆర్ఎస్ శ్రేణులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. దయాకర్‌రావును కలిసిన వారిలో బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, తీగల దయాకర్, చింత రవి, బస్వ మల్లేష్, కొల్లూరి సోమయ్య తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి తూఫాన్ యూనియన్ సభ్యుడు గుగులోత్‌హుస్సేన్ నాయక్ తండ్రి, సాయిని స్వామియాదవ్ తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, మంగళవారం ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అశోక్, మండల అధ్యక్షుడు సుమన్‌రావు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

పరామర్శ

జఫర్‌గఢ్: మండల కేంద్రద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుక్కల రాఘవులు అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పార్టీ బృందంతో కలిసి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నివాళి

రఘునాథపల్లి: కోడూర్ గ్రామానికి చెందిన కాసగాని యాకయ్య మంగళవారం అనారోగ్యంతో మరణించాడు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పార్టీ నాయకులతో కలిసి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రోదిస్తున్న కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బచ్చన్నపేట: మండల కేంద్రంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సదాశివపేట వాగు నుంచి ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తున్న కర్రె సతీష్ ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

విద్యుదాఘాతంతో కోడె మృతి

చిల్పూరు: విద్యుదాఘాతంతో కోడె మృతి చెందిన ఘటన మంగళవారం రాజవరం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఉడుత రాజు తన కోడెను రోజుమాదిరిగా గ్రామ సమీపంలోని సబ్‌స్టేషన్ వెనుక మేత కోసం వదిలాడు. ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైర్లు కోడెకు తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ.60 వేల విలువచేసే కోడె మృతి చెందిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

అన్నదానం

పాలకుర్తి: మండల కేంద్రంలో అమావాస్య సందర్భంగా అన్న ప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. దాతలు మారం శ్రీనివాస్, అల్లాడి వెంకటేశ్వర్లు, నంగునూరి మధు, రామగిరి నాగరాజు, చెన్నూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు 'రాజీవ్ యువ వికాసం' వర్తింపజేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ రూరల్: అర్హులకు రాజీవ్ యువ వికాసం పథకం వర్తింప జేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు దూడల సిద్దయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్‌లో ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు జాయ మల్లేష్ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ అధికారి రవీందర్ వినతిపత్రం అందజేశారు. రవీందర్, సలేంద్ర శ్రీనివాస్, మధు, సత్యనారాయణ, సమ్మయ్య, జాంగిర్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



కళాజాతాలో మాట్లాడుతున్న ఏఎస్సై కట్టమల్లు

రఘునాథపల్లి: సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాని రఘునాథపల్లి ఏఎస్సై కట్టమల్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులకు సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయి, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ కళాబృందంతో కలిసి అవగాహన కల్పించారు.

నియోజకవర్గానికి చీడపురుగు డాక్టర్ రాజయ్య

- టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ రమేశ్



విలేకరులతో మాట్లాడుతున్న కనకం రమేశ్

స్టేషన్‌ఘన్‌పూర్: మాదిగల పేరు చెబుతూ పబ్బం గడుపుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య నియోజకవర్గానికి పట్టిన చీడ పురుగు లాంటివాడని టీపీసీసీ లీగల్‌సెల్ కన్వీనర్, స్టేషన్ ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేశ్ అన్నారు. ఘన్‌పూర్‌లో కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజయ్యకు మాదిగల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. ఇటీవల రాజయ్య మాదిగల గురించి మాట్లాడం విడ్డూరంగా ఉందని, మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ నిరుపేదలు, బడుగు, బలహీన వర్గాల పక్షపాతి అన్నారు. రాజయ్య స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై పదేపదే ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. మరోసారి సీఎం రేవంత్‌రెడ్డిపై, ఎమ్మెల్యే కడియంపై విమర్శలు చేస్తే సహించేది లేదని, గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ నాయకులు సింగపురం వెంకటయ్య, జీడి ప్రసాద్, ఎడ్ల వెంకటస్వామి, గుర్రం ఫాతికుమార్, పుట్ట నవీన్, చింత జాకబ్, చేపూరి కొమురయ్య, ఎల్లయ్య, చింత స్వామి పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరంలో చిన్నారుల కూచిపూడి నృత్యం



కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

జనగామ: తమిళనాడు రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలేశ్వరంలో జనగామకు చెందిన మైత్రేయ కూచిపూడి కళాక్షేత్రం చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఆలయ ట్రస్ట్ పిలుపు మేరకు కళాక్షేత్రం మాస్టర్ పులిగిల్ల సుఖేష్ ఆధ్వర్యంలో 24 మంది చిన్నారులు అరుణాచలేశ్వరం సన్నిధికి వెళ్లారు. ఈ నెల 26వ తేదీన రాత్రి నృత్య నీరాజన ప్రదర్శన చేశారు. 3గంటల పాటు సాగిన నృత్య ప్రదర్శనలో చిన్నారుల ప్రతిభ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంది. అరుణాచలేశ్వర టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ చేతుల మీదుగా చిన్నారులకు సర్టిఫికెట్లతో పాటు మెమెంటోలను అందించారు. వర్షిత, కేఎల్ఆర్ రిహాన్షి, నిహారిక, మనస్విక, దీతిక, ధనుషిత, రూపాలి, శ్రీ ఆద్య, అవిజ్ఞ, ఆరోహి, శ్రీహిత, రిషిక, అవిజ్ఞ, ప్రహసిని, ఎస్ఆర్ఐ పద్మావతి, టెంపుల్ ట్రస్ట్ సభ్యులు జగదీష్, సంపత్, తల్లిదండ్రులు ఉన్నారు.

నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించాలి

- హౌసింగ్ పీడీ మాతృనాయక్



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ మాతృనాయక్

బచ్చన్నపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిబంధనల ప్రకారమే చేపట్టాలని హౌసింగ్ పీడీ ఏ.మాతృనాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లను 400 ఎస్ఎఫ్‌టీ తక్కువ కాకుండా 600 ఎస్ఎఫ్‌టీ ఎక్కువ కాకుండా నిర్మించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 716 ఇండ్లు మంజూరీ కాగా 231 బేస్మెంట్ లెవల్, 47 స్లాబ్ లెవల్, 3 స్లాబ్‌లను పోశారన్నారు. ఇందిరమ్మ ఇళ్లను పంచాయతీ కార్యదర్శులు సందర్శించి ఇంటి నిర్మాణం చేసే మేస్త్రీ పేరు ఖాతా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సాల్వాపూర్ గ్రామంలో సాంకేతిక లోపాలు ఉన్నాయని, వాటిని త్వరలోనే తీరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ జే.భజరంగ్ లాల్, ఈఈ ఈశ్వర్ లాల్, ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిజామాబాద్‌కు డీలక్స్ బస్ సర్వీస్‌లు

జనగామ: జనగామ డిపో నుంచి వయా హనుమకొండ మీదుగా నేటి(బుధవారం) నుంచి నిజామాబాద్‌కు రెండు డీలక్స్ బస్సు సర్వీసులను నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్.స్వాతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమకొండ, హుజురాబాద్, కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్ మీదుగా నిజామాబాద్‌కు నడిపించనున్నట్లు తెలిపారు. జనగామ డిపో నుంచి మొదటి బస్సు ఉదయం 5గంటలకు, రెండో సర్వీస్ ఉదయం 5.45 గంటలకు బయలుదేరుతుందన్నారు. జనగామ నుంచి నిజామాబాద్‌కు టికెట్ ధర పెద్దలకు రూ.430, పిల్లలకు రూ.230గా నిర్ణయించినట్లు డీఎం తెలిపారు. జనగామ పరిసర ప్రాంత ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కరాటేతో ఆత్మస్థైర్యం పెంపు



పాలకుర్తి: విద్యార్థులతో వెంకట్‌రెడ్డి

జఫర్‌గఢ్: కరాటే శిక్షణతో విద్యార్థులల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. డీవైఎస్ఓ ఆధ్వర్యంలో తమ్మడపల్లి (జి)గ్రామంలో సమ్మర్ క్యాంపులో ఇస్తున్న కరాటే శిక్షణను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు వేసవిలో సెలవులు వృథా చేయకుండా కరాటే శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. అనంతరం కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోచ్ అన్నెపు రాజేంద్రం విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాల సందర్శన

పాలకుర్తి: చెన్నూరులో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని జిల్లా క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో ఇస్తున్న సాఫ్ట్‌బాల్ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. శిక్షణ ఇస్తు న్న కోచ్ బాలబోయిన సందీప్‌ను అభినందించారు.

30న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

జనగామ రూరల్: ఈనెల 30 జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి పి.సాహితి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపోలో ఫార్మసీ, హైదరాబాద్ లోటస్ కంపెనీలో నియామకాలకు ఇంటర్వ్యూలు జరగనున్నాయన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు తమ సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్‌లోని 8వ గది సమావేశ మందిరంలో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 7995430401లో సంప్రదించాలని కోరారు.

కొనుగోలు కేంద్రంలో అవకతవకలపై ఆరా



విచారణ చేస్తున్న అధికారులు

బచ్చన్నపేట: పోచన్నపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయంలో అవకతవకలు జరిగాయని గ్రామానికి చెందిన పలువురు రైతులు మంగళవారం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అదనపు కలెక్టర్.. స్థానిక రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులను విచారణ చేపట్టాలని ఆదేశించారు. కాగా, నాయబ్ తహసీల్దార్ ఫణికిషోర్, ఎంఆర్ఐలు వంశీ కృష్ణ, మున్వర్, సివిల్ సప్లయీస్ డీటీ దేవాసింగ్, ఏసీఎస్ఓ ఇర్ఫాన్ తదితర అధికారులు రైతులను విచారించారు. ఫిర్యాదులో ఎలాంటి వాస్తవం లేదని పలువురు రైతులు సంతకాలతో తీర్మానం చేసి అధికారులకు అందించారు. ఐకేపీ ఏపీఎం నాగేశ్వర్‌రావు, సీసీ తిరుమల, నాయకులు నీలంరెడ్డి, సోమిరెడ్డి, మహేందర్‌రెడ్డి, ఎండీ. ఫిరోజ్, సిద్దారెడ్డి, కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

కొడకండ్ల: నిరుపేద బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనను అందిస్తుందని పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ అన్నారు. మంగళవారం రేగుల తండలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అర్హులకు సంక్షేమ పతకాలు అందేలా యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. బీఆర్ఎస్ చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు యాకేష్‌యాదవ్, రవి, భిక్షపతి, సాగర్, మల్సూర్, నవీన్, సాయి, రజినీకాంత్, నిఖిల్, దళపతి, సోమన్న, నిమ్మ పాల్గొన్నారు.